శక్తి గణపతికి గరిక పూజ



నల్లకుంట: శంకరమఠంలో వేదమంత్రోచ్చరణల నడుమ శక్తి గణపతికి అభిషేకం చేసి గరిక పూజ నిర్వహించారు. అలాగే చంద్రమౌళీశ్వర స్వామి, శారదామాతకు ప్రత్యేక పూజలు కావించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాద వితరణ జరిగింది.

వైభవంగా రాధాష్టమి



నల్లకుంట: రాధాష్టమిని పురస్కరించుకొని ప్రశాంత్‌నగర్‌లోని కుసుమహరనాథ ఆశ్రమంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణులను పట్టువస్త్రాలు, పూలమాలలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.

బీసీ బిల్లు ఆమోదం హర్షణీయం

నల్లకుంట: బడుగు, బలహీన వర్గాలు రాజకీయంగా ఎదగాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేలా అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెడుతూ జీవో జారీ చేయడం పట్ల బీసీ జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు జేపీ మురళీకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం నల్లకుంట డివిజన్ రత్నానగర్‌లోని బీసీ జాగృతి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లతో బడుగు, బలహీన వర్గాలకు ఉద్యోగ, విద్యతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో న్యాయం జరుగుతుందన్నారు. ఈ బిల్లు ఆమోదానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఎన్నికలకు ముందు కామారెడ్డి డిక్లరేషన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడం అభినందనీయమని అన్నారు.

తంగిరాల చక్రవర్తి సాహిత్య సేవలు చిరస్మరణీయం

చిక్కడపల్లి: తంగిరాల చక్రవర్తి సాహిత్య సేవలు చిరస్మరణీయమని వక్తలు అన్నారు. విశ్వ సాహితీ సాంస్కృతిక సంస్థ, అఖిల భారతీయ భాషా సాహిత్య సమ్మేళన్ కార్యక్రమంలో ప్రముఖులు ఆచార్య గౌరీశంకర్, ప్రొ. జయరాములు, చిదంబరం, జయసూర్య, జి.పద్మావతి, మిద్దె సురేష్, సాయిసుందర్‌లు పాల్గొని చక్రవర్తి చిత్రపటానికి పూలమాలవేసి ఆదివారం నివాళులు అర్పించారు.

అలరించిన సినీసంగీత విభావరి

చిక్కడపల్లి: నూతన సాంస్కృతిక సంస్థ సంధ్యా సరాగాల పల్లవి ఆధ్వర్యంలో ఆదివారం త్యాగరాయ గానసభలో తెలుగు, హిందీ సినీసంగీత విభావరి అలరించింది. అనంతరం జరిగిన సమావేశంలో సామాజిక సేవకురాలు, సిటీ సివిల్ కోర్టు సూపరింటెండెంట్ పీవీపీ అంజనీ కుమారి ముఖ్యఅతిథిగా హాజరై గాయకులతో పాటు నిర్వాహకురాలు భాగ్యలక్ష్మిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు సీహెచ్ త్రినాథరావు, వీణాపాణిశాస్త్రి, రమణారెడ్డి, చిత్ర, నిర్మల, శ్రీనివాస్, కల్యాణి, ఇజాయత్ ఆలీ, మురళి, దాసు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ముషీరాబాద్: జనహిత సేవా ట్రస్ట్, యువశక్తి యూత్ అసోసియేషన్, కిమ్స్ ఫౌండేసన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జమిస్తాన్‌పూర్‌లో యువశక్తి యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం వద్ద జరిగిన శిబిరంలో కిమ్స్ ఆస్పత్రి వైద్యులు 200 మందికి వైద్య పరీక్ష చేశారు. ఈ సందర్భంగా అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ శిబిరంలో అసోసియేషన్ ప్రతినిధులు రాజ్‌కిరణ్, మహేష్, ఆదిత్య, కిరణ్‌కుమార్, శ్రీకాంత్, ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.



నిమజ్జన ఏర్పాట్లు ముమ్మరం.!

- అంబర్‌పేట నియోజకవర్గంలో సుమారు 1000 మండపాలు
- నిమజ్జన ఏర్పాట్లలో నిమగ్నమైన వివిధ విభాగాల అధికాలు
- చెట్ల కొమ్మలు, విద్యుత్ వైర్ల అడ్డు తొలగింపు
- మూసీ పరీవాహక ప్రాంతంలో నీటి కొలను ఏర్పాటు
- కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్న పోలీసు విభాగం



అంబర్‌పేట మూసీ పరీవాహక ప్రాంతంలో ఏర్పాటు చేసిన నీటి కొలనును పరిశీలిస్తున్న జెడ్‌సీ రవికిరణ్

అంబర్‌పేట: గణేశ్ నిమజ్జన వేడుకలకు అధికార యంత్రాంగం ముమ్మర చర్యలు చేపట్టింది. అంబర్‌పేట నియోజకవర్గంలో గణేశ్ నిమజ్జన వేడుకలు విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. నియోజకవర్గంతో పాటు రామంతాపూర్, ఉప్పల్ ప్రాంతాల మీదుగా అంబర్‌పేట నుంచి ట్యాంకు బండ్ వైపు వెళ్లే విగ్రహాల తరలింపునకు సైతం ఇక్కడి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జీహెచ్‌ఎంసీ,పోలీసు విభాగాల అధికారులు కసరత్తు చేస్తున్నారు. అంబర్‌పేట ప్రధాన రోడ్ల గోల్నాక జిందా తిలిస్మాత్,శివం, సీపీఎల్, నల్లకుంట, బర్కత్‌పుర ప్రాంతాల్లో ఇప్పటికే చెట్ల కొమ్మల తొలగింపు చర్యలు ముమ్మరం చేశారు. అలాగే విద్యుత్ వైర్లు, రోడ్ల గంతలు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. గణేశ్ ప్రతిమల నిమజ్జనానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.

మూసీ పరీవాహక ప్రాంతంలో నిమజ్జనం..

◆ జ్యోతిరావు పూలే చౌరస్తా మూసి పరిసరాల్లో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో గణేశ్ నిమజ్జనానికి ప్రత్యేక నీటి కొలనును ఏర్పాటు చేశారు. కొలను గణేశ్ ప్రతిమల నిమజ్జనానికి కావాల్సిన అన్ని సౌకర్యాలను కల్పించారు. ఫ్లైడ్‌లైట్లు, పారిశుద్ధ్యం, బురద వంటివి లేకుండా ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ఇక్కడ ఏర్పాటు చేసిన కొలనులో 150 విగ్రహాల వరకు నిమజ్జనం చేశారు. చిన్నపాటి విగ్రహాలను ఇక్కడ ఘనంగా నిమజ్జనం చేశారు. మరిన్ని విగ్రహాలు నిమజ్జనం చేయడానికి కావల్సిన వసతులను కల్పిస్తామని జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్, అంబర్‌పేట సర్కిల్ డీఎంసీ మారుతీదివాకర్ ఆదివారం తెలిపారు. నీటి కొలనును సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పోలీసు స్టేషన్ల వారీగా విగ్రహాలు...

◆ అంబర్‌పేట పోలీసు స్టేసన్ పరిధిలో	440
◆ కాచిగూడ పోలీసు స్టేషన్ పరిధిలో	238
◆ నల్లకుంట పోలీసు స్టేషన్ పరిధిలో	157

సమచారం ఇస్తే సహకారం...

◆ వినాయక విగ్రహాల ఏర్పాటు, నిమజ్జన ఊరేగింపుపై నిర్వాహకులు ఇప్పటికే పోలీసులకు సమాచారం అందించి అనుమతులు పొందారు. సమాచారం లేకుండా నిమజ్జనం కార్యక్రమం చేస్తే నిర్వహకులతో కావాల్సిన సహకారం అందించడం ఇబ్బంది అవుతుందని పోలీసులు పేర్కొంటున్నారు. సమాచారం అందిస్తే బందోబస్తుతో పాటు ఇతర విభాగాల సమన్వయంతో వాహనాలను సమకూర్చడం, విద్యుత్, ఇతర సదుపాయాలు కల్పిస్తున్నామని అన్నారు. నిర్వాహకులు పోలీసులతో సమన్వయం చేసుకోవాలని సూచిస్తున్నారు.



గోల్నాక ప్రధాన రోడ్డులో కొమ్మల తొలగింపు

గత అనుభవాలను పరిగణలోకి తీసుకుని..

వినాయక నిమజ్జనంపై ఇప్పటికే పలుమార్లు నిర్వహకులతో సమావేశాలు ఏర్పాటు చేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు అందించాం. అనుమంతి పొందిన ప్రతి మండపం వద్ద పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. యువత భక్తి శ్రద్ధలతో గణేశ్ వేడుకలను నిర్వహించుకుని పోలీసులకు సహకరించాలి. వేడుకల్లో తగాదాలకు లేకుండా ప్రశాంతంగా జరుపుకోవాలి. ఎలాంటి ఇబ్బందులు ఉన్న పోలీసులకు ఫిర్యాదు చేయలే తప్ప చట్టాన్ని చేతులోకి తీసుకోకూడదు.

– ఏసీపీ హరిష్‌కుమార్

మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పి.నారాయణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వాటర్ వర్క్స్ (హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ)లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కనీస వేతనాల బోర్డు మాజీ చైర్మన్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పి.నారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వాటర్ వర్క్స్‌లో సుమారు 700 మంది మీటర్ రీడర్లు పని చేస్తున్నారని అన్నారు. వీరందరికి జీవో 60 కేటగిరి 2 ప్రకారం రూ.19,500ల వేతనం ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.15,500 మాత్రమే ఇస్తున్నారని అన్నారు. గతంలో కమిషన్ ఆధారంగా విధానాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం ఔట్ సోర్సింగ్‌లోకి మార్చి కొంత ఉద్యోగ భద్రత కల్పించిందన్నారు. సింగిల్ ఎజెన్సీ ద్వారా వేతనాలు ఇవ్వడంతో పాటు ఆరోగ్య భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ సంతోష్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, బాలకృష్ణరెడ్డి, రమేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు స్పందించారు.!

సాక్షి ఎఫెక్ట్

నల్లకుంట: శివం రోడ్డు ఎస్‌బీఐ సమీపంలో రోడ్డు మధ్యన ఓ గుంత ఏర్పడింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమస్యను గుర్తించిన సాక్షి 'వాహనదారులు జర జాగ్రత్త' అనే శీర్షికతో ఆదివారం ఓ కథనాన్ని ప్రచురించింది. అందుకు స్పందించిన సంబంధిత శాఖ అధికారులు వెంటనే రోడ్డు మధ్యన ఏర్పడిన గుంతకు మరమ్మతులు చేపట్టారు.



బీసీ రిజర్వేషన్ల అమలుకు అన్ని పార్టీలు మద్దతివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న డా. దిడ్డి సుధాకర్

కవాడిగూడ: రాష్ట్రంలో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పక్కగా అమలు అయ్యే విధంగా రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు సంపూర్ణ మద్దతు ప్రకటించాలని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ పేర్కొన్నారు. ఆదివారం దోమలగూడలోని రాష్ట్ర కార్యాలయంలో ఆప్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి చేతులు దులుపుకుంటే సరిపోదని కేంద్రంపై ఒత్తిడి తెచ్చి పార్లమెంట్‌లో చర్చించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రతి పక్ష బీఆర్ఎస్ తన సంపూర్ణ మద్దతు ప్రకటించాలని కోరారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై కాకుండా టైంపాస్ చేస్తూ ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకునేందుకు నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా కామారెడ్డి, మెదక్, నిర్మల్, సిరిసిల్ల జిల్లా ప్రజలను ప్రభుత్వం వెంటనే ఆదుకొని వరదల్లో ప్రాణాలు కోల్పోయిన వారికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పెన్షన్లు పెంచాలని కోరారు.

రంగోళి విజేతలకు సత్కారం

నల్లకుంట: భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి (బీజీయూఎస్) అంబర్‌పేట ఆధ్వర్యంలో ఆదివారం నల్లకుంట డివిజన్ తిలక్‌నగర్ పెద్ద గణేషుడి మండపం వద్ద రంగోళి (ముగ్గుల) పోటీలు నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి సతీమణి కావ్యరెడ్డి, కార్పొరేటర్లు అమృత, ఉమారాణి, బీజీయూఎస్ ప్రధాన కార్యదర్శి డా. రావినూతల శశిధర్‌తో కలిసి విజేతలకు బహుమతులుగా చీరలు అందజేశారు. కార్యక్రమంలో బీజీయూఎస్, బీజేపీ నాయకులు ఆనంద్‌గౌడ్, విజయలక్ష్మి, బుచ్చిరెడ్డి, ఆలె భాస్కర్, అరుణ జ్యోతి, గౌతంరావు, అచ్చిని రమేష్, నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పదవి విరమణ అనేది ఉద్యోగానికే కానీ వయసుకు కాదని ఎస్ఈ పి.వెంకన్న అన్నారు.సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం అజమాబాద్ డివిజన్‌లో పనిచేస్తున్న ఎం. వెంకటేశ్వరరావు ఉద్యోగ విరమణ సభ జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్‌రావు దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీఈ కమల్‌కుమార్, ఏడీఈ శ్రీనివాస్, 1104 డివిజన్ యూనియన్ ప్రెసిడెంట్ పి.ప్రవీణ్ కుమార్, కార్యదర్శి జీఎం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

కాచిగూడ: రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... మైలార్‌దేవ్‌పల్లికి చెందిన జగన్నాథరావు(51) కొంత కాలంగా కేన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఆదివారం ఫలక్‌నుమా–శివరాంపల్లి రైల్వే స్టేషన్ల మధ్య రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి



వడ్డెరుల సదస్సులో మాట్లాడుతున్న శివరాత్రి అయిలుమల్లు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో వడ్డెరలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర వడ్డెర సంఘం చైర్మన్ శివరాత్రి అయిలుమల్లు డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ వడ్డెర సంఘం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ గౌరవ అధ్యక్షులు పట్ల మల్లేశం అధ్యక్షతన 8వ వార్షికోత్సవం జరిగింది. ఈ సందర్భంగా శివరాత్రి అయిలు మల్లు మాట్లాడుతూ... రాష్ట్రం ఏర్పడి 11 సంవత్సరాలు గడిచినా వడ్డెర బతుకుల్లో ఎలాంటి మార్పు లేదన్నారు. వడ్డెరలను వెనుకబాటుకు గురిచేసి ఓట్ల కోసం పబ్బం గడుపుతున్నారని విమర్శించారు. వడ్డెరలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి వేయి కోట్ల బడ్జెట్ కేటాయించాలన్నారు. ప్రభుత్వ పనుల్లో వడ్డెర కాంట్రాక్టర్లకు 25 శాతం పనులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. వడ్డెరలను బీసీ జాబితా నుంచి తొలగించి ఎస్టీ జాబితాలో చేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు వేముల శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ శివరాత్రి మల్లేష్, గ్రేటర్ అధ్యక్షుడు బోదాసు నరసింహ, వరికుప్పల భూపాల్, మహిళ అధ్యక్షురాలు శివరాత్రి ఉమా, రాజమ్మ, పుల్లపు పద్మ, శారద తదితరులు పాల్గొన్నారు.

'భారత్ అన్ని రంగాల్లో దూసుకుపోతోంది'



అడిక్‌మెట్ డివిజన్‌లో కార్యకర్తలతో కలిసి మన్ కీ బాత్ వీక్షిస్తున్న డాక్టర్ కె.లక్ష్మణ్

ముషీరాబాద్: భారతదేశ ప్రధాని నరేంద్రమోదీ తీసుకుంటున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో దేశం అన్ని రంగాల్లో దూసుకుపోతుందని, ప్రపంచంలోని అగ్రదేశాల సరసన దేశాన్ని నిలబెట్టిన ఘనత ప్రధాని నరేంద్రమోదీకి దక్కుతుందని రాజ్యసభ సభ్యులు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ కొనియాడారు. ఆదివారం అడిక్‌మెట్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సాయికృష్ణయాదవ్ నివాసంలో మన్ కీ బాత్ కార్యక్రమాన్ని కార్యకర్తలతో కలిసి వీక్షించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పాకిస్తాన్ ఉగ్రవాదులను మట్టుబెట్టడానికి ఆపరేషన్ సిందూర్ చేపట్టడంతో పాకిస్థాన్ తోకముడిచిందన్నారు. భారత్ యుద్ధాన్ని ఎప్పుడూ కోరుకోదని కానీ తోక జాడిస్తే చూస్తూ ఊరుకోదనేది 'ఆపరేషన్ సిందూర్'తో ప్రపంచానికి తెలిసిందన్నారు. రష్యా, చైనా ప్రధానులతో మోదీ చేస్తున్న దౌత్యం గతంలో ఏ ప్రధాని చేయలేదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సాయికృష్ణయాదవ్, సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షులు భరత్‌గౌడ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శేషసాయి, విన్నూముదిరాజ్, కొండిన్య ప్రసాద్, వంశీ, నరేష్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

నల్లకుంట డివిజన్‌లో..

నల్లకుంట: ప్రధాని మోదీ మన్‌కీ బాత్ 125వ ఎపిసోడ్‌లో దేశప్రజలను ఉద్దేశించి చేసిన ప్రసంగాన్ని ఆదివారం నల్లకుంట మాజీ కార్పొరేటర్ వనం రమేష్ నివాసంలో బీజేపీ నాయకులు వీక్షించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ వనం రమేష్ మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలు, సహజ విపత్తులు, క్రీడా రంగంలో జరుగుతున్న విజయాలు, ప్రభుత్వ చర్యల గురించి ప్రధాని మోదీ మాట్లాడారని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని బీజేపీ బూత్ 8, 10, 11 నంబర్ నాయకులు వెంకటేష్ గౌడ్, శ్రవణ్‌యాదవ్, చంద్రశేఖర్, గణేష్, రోహిత్ శాస్త్రి తదితరులు వీక్షించారు.

ముదిరాజ్‌లకు బీజేపీలో ప్రాధాన్యం కల్పించండి

కాచిగూడ: తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యవర్గంలో, పార్టీ అనుబంధ సంఘాల్లో, పార్టీ కేంద్ర కమిటీల్లో ముదిరాజ్‌లకు తగిన ప్రాధాన్యం కల్పించాలని తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర చొప్పరి శంకర్‌ముదిరాజ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం బర్కత్‌పురలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని మహాసభ నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. తెలంగాణలో అత్యధిక జనాభా కలిగిన ముదిరాజ్‌లకు పార్టీలో అవకాశం కల్పిస్తే రానున్న రోజుల్లో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొల్ల కరుణాకర్ ముదిరాజ్, రాష్ట్ర యువత అధ్యక్షుడు రాజుముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీని విమర్శిస్తున్న కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి



ప్రాగాటూల్ చౌరస్తాలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

ముషీరాబాద్: ప్రధాని నరేంద్రమోదీ, ఆయన తల్లిపై అనుచిత వాఖ్యలు చేస్తున్న కాంగ్రెస్ అగ్రనేతలకు దేశ ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని మహంకాళి జిల్లా బీజేపీ అధ్యక్షుడు భరత్‌గౌడ్ అన్నారు. ఆదివారం బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ రమేష్‌రాం ఆధ్వర్యంలో ప్రాగాటూల్స్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ ప్రధాని మోదీ తల్లిపై అనుచిత వాఖ్యలను ఖండిస్తూ ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. భరత్‌గౌడ్ మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీకి రాజకీయాలు తప్ప, భారతీయ సాంస్కృతి సంప్రదాయాలు తెలియవని అందువల్లే ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని అన్నారు. వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూస రాజు, కార్పొరేటర్లు రవిచారి, సుప్రియానవీన్‌గౌడ్, డివిజన్ అధ్యక్షుడు కంచి ముదిరాజ్, గడ్డం నవీన్, కృష్ణ, నందగిరి నర్సింహ, చంద్రమోహన్, బబ్లూ, సత్యనారాయణ పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల ఆమోదం చారిత్రక నిర్ణయం

కాచిగూడ: బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలపడం చారిత్రక నిర్ణయమని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి అన్నారు. ఆదివారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు సముచిత ప్రాతినిధ్యం ఇవ్వడమే లక్ష్యంగా, పంచాయతీరాజ్ చట్టం- 2018, పురపాలక చట్టం- 2019లో ఉన్న 50 శాతం పరిమితిని తొలగిస్తూ సవరణ బిల్లులు ప్రవేశపెట్టడం అభినందనీయమని అన్నారు. వాటిని అసెంబ్లీ ఆమోదించడం శుభపరిణామమని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ పాలనలో బీసీ రిజర్వేషన్లను 34శాతం నుంచి 23శాతానికి తగ్గించబడ్డాయని తెలిపారు. ఆ ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందని అన్నారు.

◆ ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం అంకితభావంతో ముందుకు వచ్చి బీసీలకు న్యాయం చేస్తోందన్నారు. కుల సర్వే నిర్వహించి దానికి అనుగుణంగా బిల్లులు తెచ్చుకోవడం ప్రభుత్వ సామాజిక చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. బీజేపీకి బీసీల పట్ల నిజమైన నిబద్ధత ఉంటే రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే ఆమోదింపజేయాలని ఆయన డిమాండ్ చేశారు. బలహీన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించాలన్న రాహుల్ గాంధీ హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. కానీ బీజేపీ మాత్రం బీసీలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. ఇకపై బీసీ వర్గాలు మౌనంగా ఉండబోవని పేర్కొన్నారు.



చెప్పల్‌బజార్‌లో.. కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి



నింబోలిఅడ్డలో.. కార్పొరేటర్ ఉమారాణి



పూజలో గ్రీన్ రిచ్ రెసిడెన్సీ ప్రతినిధులు



గ్రీన్ రిచ్ రెసిడెన్సీ ఆధ్వర్యంలో అన్నదానం



గోల్నాకలో.. కార్పొరేటర్ లావణ్య



గోల్నాక గోవింద్‌నగర్‌లో.. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



మయూరీ లేన్‌లో చిన్నారులకు పోటీలు



రాంనగర్‌లో.. బీఆర్ఎస్ నాయకులు నగేష్

కవాడిగూడ తాళ్లబస్తీలోని గణేశ్ మండపంలో జరిగిన పూజలో భక్తులు



ఓం గణేశాయ నమః

వినాయక నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. అంబర్‌పేట, ముషీరాబాద్ నియోజకవర్గాల్లో వాడవాడలా వెలసిన మండపాల్లో పార్వతీసుతుడి సేవలో భక్తులు పునీతులవుతున్నారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ భక్తి పారవశ్యంలో మునిగి తెలుతున్నారు. భాగ్యనగర్‌లోని ఆయా ప్రాంతాల్లో గణేష్ ఉత్సవ సందడితో వీధులన్నీ శోభిల్లుతున్నాయి. పలు చోట్ల మండపాల వద్ద అన్నదానాలు నిర్వహించారు. నింబోలిఅడ్డ, చెప్పల్‌బజార్ తదితర ప్రాంతాల్లోని మండపాలకు వెళ్లి కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి పూజలు చేశారు. అదేవిధంగా ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు భక్తులతో కలిసి పూజల్లో పాల్గొన్నారు.

– ముషీరాబాద్, అంబర్‌పేట జోన్ బృందం



గోల్నాకలోని శ్రీసాయి రెసిడెన్సీలో..



బాగ్‌లింగంపల్లిలో.. ఎమ్మెల్యే ముఠాగోపాల్



బాగ్‌లింగంపల్లిలో నిమజ్జనానికి తీసుకెళ్తూ..



పూల్‌బాగ్‌లో అన్నదానం చేస్తున్న బీజేపీ నేతలు



బండమైసమ్మనగర్‌లో అడిషనల్ డీసీపీ నర్సయ్య



పటేల్‌నగర్ జరిగిన అన్నదానంలో భక్తులు



అశోక్‌నగర్‌లో ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ పూజలు



రాంనగర్ గుండు వద్ద..



శ్రీసాయి టవర్స్ వాసుల పూజలు